సాక్షి విశాఖపట్నం

శనివారం । 19 । ఏప్రిల్ । 2025





ఏటీసీటీ ఈవెంట్ మేనేజ్‌మెంట్ సంస్థ ఆధ్వర్యంలో శనివారం పోర్టు స్టేడియంలో మ్యూజిక్ కాన్సర్ట్ నిర్వహిస్తున్నట్లు ప్రముఖ సంగీత దర్శకుడు దేవిశ్రీప్రసాద్ తెలిపారు.





సుర్రుమన్న సూరీడు ఆహ్లాదపరిచిన మేఘాలు

నగరంలో శుక్రవారం వాతావరణం చిత్రంగా మారింది. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు భానుడు తన ప్రతాపాన్ని చూపించాడు. ఎండ తీవ్రత ఎక్కువగా ఉండటంతో నగర ప్రజలు ఉక్కపోతతో ఇబ్బంది పడ్డారు. అయితే, సాయంత్రం వేళ ఒక్కసారిగా వాతావరణం చల్లబడింది. ఆకాశం నల్లటి మేఘాలతో కమ్ముకుంది. చల్లని గాలులు వీచడంతో వాతావరణం ఆహ్లాదకరంగా మారింది. ఉదయం వేడితో అలసిపోయిన ప్రజలు సాయంత్రం చల్లదనంతో ఊపిరి పీల్చుకున్నారు.

– ఫొటో : సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం/సీతమ్మధార

స్తోత్రం ప్రభువా..

క్రీస్తుకు శిలువ వేసే గుడ్‌ఫ్రైడే ప్రార్థనలు జిల్లా వ్యాప్తంగా శుక్రవారం భక్తిశ్రద్ధలతో జరిగాయి. లోక రక్షకుడైన క్రీస్తు.. సర్వ మానవపాప విముక్తి కోసం మరణ శిక్ష పొందిన రోజును శుభ శుక్రవారంగా పేర్కొంటూ క్రైస్తవ విశ్వాసులందరూ ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కరుణామయుడు శిలువ మోసిన రోజును స్మరించారు. ఈ శుభ శుక్రవారం ప్రత్యేక ప్రార్థనలతో అన్ని క్రైస్తవ మందిరాలూ కిక్కిరిశాయి. మానవులు చేసిన పాపాలను తను మోస్తూ శిలువపై ప్రాణాలను అర్పించి త్యాగాన్ని చాటిన ఏసును స్తోత్రాలతో కీర్తించారు. శిలువ ధ్యానాన్ని పాటించారు.





– ఫొటోలు : సాక్షి ఫొటోగ్రాఫర్, విశాఖపట్నం

ఈపీడీసీఎల్‌కు టెండర్

- సబ్ స్టేషన్లు పంచుకుంటున్నారు
- ఈపీడీసీఎల్ పరిధిలో సబ్ స్టేషన్ల నిర్మాణంలో హస్తలాఘవం
- మూడు సంస్థలకే అన్ని ప్యాకేజీల అప్పగింత

సాక్షి, విశాఖపట్నం : ఆస్తులు పంచుకున్నట్లు.. ఈపీడీసీఎల్‌లో పనులు పంచేసుకుంటున్నారు. అధికారుల అండదండలతో ఈ భాగంలో పనులు నీకు.. ఆ భాగంలో నీకు.. అంటూ వాటాలు వేసుకుంటూ మరీ.. టెండర్ల ప్యాకేజీలు అప్పనంగా అప్పగించేస్తున్నారు. సర్కిల్ ఏదైనా ఎలాంటి సబ్‌స్టేషన్ అయినా ఆ మూడు సంస్థలకే పనులు కట్టబెట్టేలా విద్యుత్ శాఖ అధికారులు హస్తలాఘవాన్ని ప్రదర్శిస్తున్నారు. ఒకసారి టెండర్ ధర కంటే లెస్‌కు వేస్తే మరోసారి అధికంగా వేస్తారు. అయినా వారికే కాంట్రాక్టులు కట్టబెడతారు. ఇటీవల దాదాపు 35 సబ్ స్టేషన్ల నిర్మాణ పనులన్నీ మూడు కాంట్రాక్టు సంస్థల జేబుల్లోకే వెళ్లిపోయాయి.

గత ఏడాది కాలంలో ఈపీడీసీఎల్ పరిధిలో 35 సెమీ ఇండోర్ సబ్ స్టేషన్లు, అవుట్ సబ్‌స్టేషన్ల నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. సర్కిళ్ల వారీగా టెండర్లు పిలిచారు. ఇక్కడే విద్యుత్ శాఖ అధికారులు, కాంట్రాక్టర్లు కుమ్మక్కైనట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. విజయనగరం సర్కిల్, విశాఖపట్నం (పాతసర్కిల్) పరిధిలో 3 సెమీ ఇండోర్ సబ్‌స్టేషన్లు, 6 అవుట్‌డోర్ సబ్‌స్టేషన్ల నిర్మాణంతో పాటు కనెక్టింగ్ లైన్స్, ఇంటర్ లింకింగ్ లైన్స్ ఏర్పాటుకు సంబంధించి ఒక ప్యాకేజీగా టెండర్లు పిలిచారు. అదేవిధంగా పాత తూర్పుగోదావరి సర్కిల్ పరిధిలో 8 అవుట్ డోర్ సబ్‌స్టేషన్లు, 8 ఇండోర్ సబ్ స్టేషన్ల నిర్మాణం, ఇతర పనులకు, పాత పశ్చిమ గోదావరి సర్కిల్ పరిధిలో 5 అవుట్‌డోర్, 5 ఇండోర్ సబ్‌స్టేషన్లు, ఇతర పనులకు సంబంధించి టెండర్లు పిలిచారు. మొత్తం 35 సబ్ స్టేషన్ల నిర్మాణ పనుల్ని మూడు ప్యాకేజీలుగా సర్కిళ్ల వారీగా విభజించారు.

మీరు లెస్‌కు.. మేం ఎక్సెస్‌కు..

సదరు కాంట్రాక్టు సంస్థలు కూడా ఈ పనుల విషయంలో రింగ్‌గా వ్యవహరించినట్లు ఈపీడీసీఎల్‌లో విమర్శలు వినిపిస్తున్నాయి. ఒక ప్రాంతంలో టెండరు విలువ కంటే తక్కువకు కోట్ చేస్తే.. మరో ప్రాంతంలో అధిక ధరకు టెండరు దాఖలు చేశారు. వారు ఎలా టెండర్ ఫైల్ చేసినా.. ఇవ్వాలన్నదే విద్యుత్ అధికారుల అంతిమ లక్ష్యంగా వ్యవహరించారని సమాచారం. విజయనగరం, విశాఖపట్నం సర్కిళ్ల పరిధిలో రూ.21.77 కోట్లకు టెండర్లు పిలవగా సదరు సంస్థ 1.31 శాతం అధికంగా రూ.22.06 కోట్లకు టెండర్ వేసింది. అయినా సదరు కాంట్రాక్టు సంస్థకే టెండరు దక్కింది. అదే విధంగా పాత పశ్చిమ గోదావరి సర్కిల్ పరిధిలో రూ.16.42 కోట్లకు టెండర్లు పిలిస్తే 1.35 లెస్‌తో రూ.16.2 కోట్లతో టెండర్లు దాఖలు చేసిన సంస్థకు అప్పగించారు.



13.6 శాతం లెస్‌కు వేస్తే నాణ్యత ఎలా.?

ఇక పాత ఈస్ట్‌గోదావరి సర్కిల్ పరిధిలో విచిత్రంగా తక్కువ ధరకే **పనులు చేసేస్తామంటూ** సదరు సంస్థ టెండరు **దాఖలు చేసింది. ఈ** సర్కిల్ పరిధిలో రూ.18.**58 కోట్లకు టెండర్లు** పిలిచారు. అయితే అధి**కారుల అనుయాయ** కాంట్రాక్టు సంస్థ ఏకంగా 13.6 శాతం లెస్‌కు అంటే రూ.16.06 కోట్లకు టెండర్ ఫైల్ చేసింది. విద్యుత్ సబ్‌స్టేషన్ల నిర్మాణం, కనెక్టింగ్ లైన్స్, ఇంటర్‌లింకింగ్ లైన్స్‌ని పూర్తి నాణ్యతతో నిర్మించాలి. కానీ సదరు సంస్థ 13.6 శాతం లెస్‌కు వేసినప్పుడు తక్కువ సొమ్ముతో నాణ్యమైన సబ్‌స్టేషన్లు నిర్మాణం ఎలా సాగుతుందన్న ఆలోచన విద్యుత్ శాఖ అధికారులకు వచ్చినా వాటన్నింటినీ పక్కనపెట్టేసి పనులు కట్టబెట్టయ్యడం గమనార్హం. కాంట్రాక్టు సంస్థలకు విద్యుత్ శాఖ అధికారులు దాసోహం అన్నట్లుగానే విద్యుత్ శాఖ అధికారులు ఈపీడీసీఎల్ పరిధిలో ఏ భారీ టెండర్ అయినా.. సదరు మూడు సంస్థలకే ప్రథమ ప్రాధాన్యమిస్తుండటంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

సర్కిల్‌కి ఒక కాంట్రాక్టర్ చొప్పున..

సర్కిళ్ల వారీగా పిలిచిన ఈ పనులను ఈపీడీసీఎల్‌ను శాసిస్తున్న మూడు కాంట్రాక్టు సంస్థలకు వచ్చేలా టెండర్ల నిబంధనల్లో మార్పులు చేసినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. సదరు కాంట్రాక్టు సంస్థలు తమ క్వాలిఫికేషన్లకు అనుగుణంగానే టెండర్ల నిబంధనలు దగ్గరుండి మరీ తయారు చేసినట్లు తెలుస్తోంది. వారి అడుగులకు మడుగులొత్తే విధంగా విద్యుత్ శాఖ అధికారులు ఈ వ్యవహారాన్ని నడిపించారు. తాము ముందుగా అనుకున్నట్లుగానే టెండర్లను మూడు భాగాలుగా విభజించి ఒక్కో ప్రాంతాన్ని ఒక్కో కాంట్రాక్టర్‌కు పంచేశారు.



బలం లేక బలవంతంగా..!



ఓటమి భయంతో చివరి అంకానికి కూటమి తెర

గ్రేటర్‌లో బలం లేకపోయినా కూటమి కుట్ర రాజకీయాలకు తెరతీసింది. అవిశ్వాసంలో నెగ్గేందుకు అడ్డదారులు తొక్కుతోంది. మేయర్ పీఠాన్ని కైవసం చేసుకోడానికి చివరి క్షణంలోనూ కుతంత్రాలు పన్నుతోంది. అవిశ్వాస తీర్మానం వీగిపోతుందన్న భయంతో చివరి అంకానికి సిద్ధమైంది. వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లను తీర్మాన సమావేశానికి బలవంతంగా తీసుకువచ్చేందుకు రౌడీలను రంగంలోకి దింపినట్లు తెలుస్తోంది. – విశాఖ సిటీ

- అవిశ్వాసంలో నెగ్గేందుకు అడ్డదారులు
- వ్యాపారాలు చేసే వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లకు బెదిరింపులు
- పార్టీ మారకపోతే బిజినెస్‌లు టార్గెట్ చేస్తామని హెచ్చరికలు
- నేటి ఉదయం 11 గంటలకు అవిశ్వాస ఓటింగ్‌కు ఏర్పాట్లు

మున్నార్‌లో ఉన్న కార్పొరేటర్లను ప్రత్యేక విమానంలో విశాఖకు తీసుకువచ్చేందుకు ఒక గ్యాంగ్ కొచ్చికి చేరుకుందన్న టాక్ వినిపిస్తోంది. అలాగే వ్యాపారాలు చేసే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్పొరేటర్లను మరోవైపు టార్గెట్ చేసింది. పార్టీ మారని పక్షంలో బిజినెస్‌లను దెబ్బకొడతామని బెదిరింపులకు దిగుతోంది. ఎలాగైనా శనివారం జరిగే అవిశ్వాస తీర్మానంలో నెగ్గేందుకు అవసరమైన అన్ని శక్తియుక్తులను వినియోగిస్తోంది. ఒకవైపు ఈ అవిశ్వాస తీర్మానాన్ని బహిష్కరిస్తున్నట్లు వైఎస్సార్‌సీపీ ఇప్పటికే తేల్చి చెప్పింది. ఆ పార్టీకి చెందిన కార్పొరేటర్లకు విప్ జారీ చేసింది. అయినప్పటికీ.. ఆ పార్టీ కార్పొరేటర్లను బలవంతంగా అయినా ప్రత్యేక కౌన్సిల్ సమావేశానికి రప్పించాలని కుటిల ప్రయత్నాలు చేస్తోంది.

కూటమికి ఓటమి భయం..

2021లో జరిగిన జీవీఎంసీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ 58 స్థానాల్లో గెలుపొంది మేయర్ స్థానాన్ని కైవసం చేసుకుంది. టీడీపీ 30, జనసేన 3, సీపీఐ, సీపీఎంలు ఒక్కో స్థానాన్ని గెలుచుకున్నాయి. స్వతంత్ర అభ్యర్థులు నలుగురు విజయం సాధించారు. అయితే 2024 సాధారణ ఎన్నికల్లో కూటమి అధికారంలోకి వచ్చిన తరువాత మేయర్ స్థానంపై టీడీపీ కన్నేసింది. జీవీఎంసీలో కేవలం 30 మంది మాత్రమే ఉన్నప్పటికీ.. వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లకు తాయిలాలు ఎర వేసి లాక్కోవాలని చూసింది. ఇందుకోసం ఒక్కో సభ్యుడికి రూ.10 లక్షలకు పైగా ఆఫర్ చేసినట్లు తెలుస్తోంది. అయినప్పటికీ.. చాలా మంది కార్పొరేటర్లు కూటమి వైపు మొగ్గుచూపలేదు. కూటమి కుట్రలు పసిగట్టిన వైఎస్సార్‌సీపీ నేతలు కార్పొరేటర్లను ముందుగానే శిబిరాలకు తరలించారు. అవిశ్వాసానికి సమయం సమీపిస్తున్నప్పటికీ.. మ్యాజిక్ ఫిగర్‌కు అవసరమైన బలం లేకపోవడంతో ఆఖరి అంకానికి తెరతీసింది. ముందు పోలీసుల్ని అడ్డుపెట్టుకొని వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లను బెదిరించాలని చూసింది. ఇందుకోసం పారిశ్రామిక ప్రాంతంలో పోలీసులు కార్పొరేటర్ ఇంటికి వెళ్లి బెదిరించిన ఘటన తీవ్ర దుమారం రేపింది. దీనిపై వైఎస్సార్‌సీపీ మాజీ మంత్రులు, నేతలు గట్టిగా స్పందించడంతో పోలీసులు వెనక్కు తగ్గాల్సి వచ్చింది. దీంతో కూటమి నేతలు చివరి పన్నాగాన్ని ఎక్కుపెట్టారు. వ్యాపారాలు ఉన్న వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లను టార్గెట్ చేశారు. తాయిలాలకు పడక పోవడంతో బిజినెస్‌లను దెబ్బకొడతామని బెదిరింపులకు దిగుతున్నారు.

కొచ్చికి కూటమి గ్యాంగ్?

శనివారం అవిశ్వాస తీర్మాన ఓటింగ్ జరగాలంటే 74 మంది సభ్యులు ప్రత్యేక కౌన్సిల్ సమావేశానికి హాజరుకావాల్సి ఉంది. వాస్తవానికి కూటమికి ఆ సంఖ్యా బలం లేదు. వైఎస్సార్‌సీపీ ఈ తీర్మాన సమావేశాన్ని బహిష్కరిస్తే.. ఓటింగ్ జరిగే పరిస్థితి ఉండదు. దీంతో వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లను బలవంతంగానైనా జీవీఎంసీకి తీసుకొచ్చేందుకు చివరి క్షణంలో కుట్రలు పన్నుతున్నట్లు తెలుస్తోంది. ఇందుకోసం ఒక గ్యాంగ్ కేరళకు వెళ్లినట్లు టాక్ వినిపిస్తోంది. ప్రస్తుతం వైఎస్సార్‌సీపీ కార్పొరేటర్లు మున్నార్‌లో ఉన్నారు. వీరిని చేరుకోవడం కోసం ఒక గ్యాంగ్ ప్రత్యేక విమానంలో కొచ్చికి వెళ్లినట్లు టీడీపీ నేతలే చెవులు కొరుక్కుంటున్నారు. మున్నార్ నుంచి కొచ్చికి కార్పొరేటర్లను తీసుకువచ్చి అక్కడి నుంచి విమానంలో విశాఖకు తరలించాలని చూస్తున్నట్లు సమాచారం.

పునరాలోచనలో మహిళా కార్పొరేటర్లు

మునుపెన్నడూ లేని విధంగా అప్పటి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి ఒక యదవ, బీసీ వర్గానికి చెందిన మహిళ గొలగాని హరివెంకటకుమారిని మేయర్‌గా అవకాశం కల్పించారు. అయితే కూటమిలో అదే సామాజిక వర్గానికి చెందిన ఎమ్మెల్యేలు మహిళా మేయర్‌ను దించడానికి విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. తన వర్గానికి చెందిన వారే తనపై అవిశ్వాసం పెట్టించడం పట్ల మేయర్ హరివెంకటకుమారి తీవ్ర ఆవేదనకు గురయ్యారు. మీడియా ముందు కన్నీళ్లు పెట్టుకున్నారు. దీంతో వైఎస్సార్‌సీపీ నుంచి కూటమిలోకి వెళ్లిన పలువురు మహిళా కార్పొరేటర్లు పునరాలోచన పడినట్లు తెలుస్తోంది. ఒక బీసీ మహిళను మేయర్ స్థానం నుంచి దించడం సరికాదన్న ఆలోచనలో గాజువాకకు చెందిన మహిళా కార్పొరేటర్ భూపతిరాజు సుజాతతో పాటు మరికొందరు ఉన్నట్లు సమాచారం. అయితే చివరి నిమిషంలో కూడా అవిశ్వాసానికి కేవలం గంటల సమయం ఉన్నప్పటికీ.. అధికార, పోలీస్ అండదండలతో అవిశ్వాసంలో నెగ్గేందుకు కూటమి నేతలు సర్వశక్తులు ఒడ్డుతున్నారు.

హోటల్ గది నుంచి బయటకు రాకుండా..

మేయర్‌పై అవిశ్వాస తీర్మాన ఓటింగ్‌కు కేవలం కొన్ని గంటలే ఉండడంతో కూటమిలో గుబులు రేగుతోంది. కూటమి కార్పొరేటర్లలో కొందరు మనసు మార్చుకునే అవకాశం ఉందన్న కలవరం మొదలైంది. కేవలం 11 నెలల పదవీ కాలం కోసం బీసీ మహిళా మేయర్‌ను దించడం సరికాదన్న అభిప్రాయాలు సర్వత్రా వ్యక్తమవుతున్నాయి. ఈ క్రమంలో కూటమి కార్పొరేటర్లు చేజారిపోకుండా ఉండేందుకు వారిని అంటిపెట్టుకొనే ఉండాలని భావిస్తున్నారు. ఇదిలా ఉంటే.. మలేషియాలో ఉన్న కూటమి కార్పొరేటర్లు శుక్రవారం రాత్రి 11.30 గంటలకు విశాఖ చేరుకున్నారు. విమానం ఆలస్యమవడంతో కూటమి నేతలు టెన్షన్ పడ్డారు. అలాగే కూటమి కార్పొరేటర్లు వైఎస్సార్‌సీపీ నేతలతో టచ్‌లోకి వెళ్లకుండా గట్టి చర్యలు తీసుకుంటున్నారు. కొందరికి దసపల్లాలో బస ఏర్పాటు చేశారు. కొందరిని భీమిలిలో ఒక రిసార్టుకు పంపించారు. వారిని హోటల్ గది నుంచి బయటకు వెళ్లనీయకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. శనివారం ఉదయం స్వయంగా ప్రత్యేక వాహనాల్లో పోలీస్ బందోబస్తు మధ్య వారిని నేరుగా జీవీఎంసీకి తీసుకువచ్చేందుకు ఏర్పాట్లు చేశారు. ఏ మాత్రం చిన్న అవకాశం ఇచ్చినా కార్పొరేటర్లు చేజారిపోతారన్న భయంతో కూటమి నేతలు కొట్టుమిట్టాడుతున్నారు.

అవిశ్వాస తీర్మాన ప్రక్రియపై అనుమానాలు

జీవీఎంసీలో శనివారం ఉదయం 11 గంటలకు అవిశ్వాస ఓటింగ్ ప్రక్రియ జరగనుంది. అయితే ఈ కౌన్సిల్ సమావేశం నిర్వహణపై వైఎస్సార్‌సీపీ నేతలు అనేక అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఒకవైపు ఓటింగ్ ప్రక్రియను వీడియోలో చిత్రీకరిస్తామని కలెక్టర్, జీవీఎంసీ ఇంచార్జ్ కమిషనర్ హరేంధిర ప్రసాద్ చెప్పారు. జీవీఎంసీ వద్ద 500 మంది పోలీసులతో భారీ భద్రతా ఏర్పాట్లు చేస్తున్నారు.

వక్ఫ్ సవరణ చట్టంపై ఉక్కు పిడికిలి

చట్టానికి వ్యతిరేకంగా గాజువాకలో ముస్లింల భారీ ర్యాలీ

గాజువాక : వక్ఫ్ బోర్డు సవరణ చట్టానికి వ్యతిరేకంగా ముస్లింలు గళం విప్పారు. మైనార్టీస్ యునైటెడ్ ఫ్రంట్ ఆధ్వర్యంలో గాజువాకలో శుక్రవారం భారీ నిరసన ర్యాలీ నిర్వహించారు. వక్ఫ్‌బోర్డులో ముస్లిమేతరులను నియమించడం అన్యాయమంటూ నినదించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. మత రాజకీయాలు చేసేందుకు బీజేపీ నాయకులు, కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. వేలాదిమంది ముస్లింలు కొత్త గాజువాక దర్గా నుంచి మెయిన్ రోడ్ మీదుగా పాతగాజువాక జంక్షన్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ పార్టీల నాయకులు ర్యాలీలో పాల్గొని కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని దుయ్యబట్టారు. వైఎస్సార్‌సీపీ గాజువాక సమన్వయకర్త తిప్పల దేవన్‌రెడ్డి మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం ముమ్మాటికీ సరైంది కాదన్నారు. ముస్లింల పూర్వీకులు అల్లాకు భూములు దానం చేశారని, వాటిపై వస్తున్న రాబడి మసీదులు, కబరస్తాన్‌లు, ఈద్గాలు, పేదల సంక్షేమానికి ఉపయోగపడుతోందని అన్నారు. ఇప్పుడు మత ద్వేషాలను రెచ్చగొట్టే విధంగా వక్ఫ్‌బోర్డులో ముస్లిమేతరులను నియమించడం సరైన పద్ధతి కాదన్నారు. దీనికి కూటమి పార్టీలు మద్దతు పలకడం విచారకరమన్నారు.సీపీఎం కార్యదర్శి, కార్పొరేటర్ బి.గంగారావు మాట్లాడుతూ అన్నదమ్ములుగా ఉన్న హిందూ, ముస్లిం, క్రైస్తవులు, సిక్కులను విడదీసేందుకు కేంద్ర బీజేపీ ప్రభుత్వం చూస్తోందన్నారు. మత విద్వేషాలను రెచ్చగొట్టే విధంగా చట్టాలను తేవడం దుర్మార్గమన్నారు. వక్ఫ్‌బోర్డులో సవరణలు తీసుకొచ్చి ముస్లిమేతరులను నియమించాలనుకోవడం అన్యాయమన్నారు. హిందూ దేవాలయాల్లో ముస్లింలను పెడతారా అని సుప్రీం కోర్టు కేంద్రాన్ని ప్రశ్నించిందని, దీనికి ప్రభుత్వం జవాబు చెప్పాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు ఎస్ఎండీ గౌస్, మహ్మద్ మదీనా మున్వర్ (బడాబాబు), అయాజ్, రెహ్మాన్, చోటాబాబు, నజీర్, హఫీజ్, షఫీ, దుబాయ్ బాషా, ఫజుల్ రెహ్మాన్, షౌకత్ అలీ, మోతీ, జావేద్, సర్దార్, ఇక్బాల్, రబ్బాని, ఖాశీం, బాషా, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.





వక్ఫ్ చట్టసవరణకు వ్యతిరేకంగా గాజువాకలో నిర్వహించిన భారీ ర్యాలీలో పాల్గొన్న ముస్లింలు, ర్యాలీలో పాల్గొన్న దేవన్‌రెడ్డి, ముస్లిం మత పెద్దలు

కూటమి కుట్రలను తిప్పికొట్టండి

• బీసీ కార్పొరేటర్లకు యాదవ హక్కుల పరిరక్షణ వేదిక పిలుపు

అగనంపూడి: విశాఖ మేయర్ పదవిని అడ్డదారిలో దక్కించుకునేందుకు కూటమి ప్రభుత్వం, నాయకులు చేస్తున్న ప్రయత్నాలను పార్టీలకు అతీతంగా బీసీలంతా అడ్డుకోవాలని, ఆ పార్టీలకు తగిన బుద్ధి చెప్పాలని ఆంధ్రప్రదేశ్ యాదవ హక్కుల పరిరక్షణ వేదిక అధ్యక్షుడు యలమంచిలి అప్పారావు, గొలగాని సత్యనారాయణ పిలుపునిచ్చారు. అగనంపూడిలో శుక్రవారం వారు మాట్లాడారు. యాదవ సామాజిక వర్గానికి చెందిన మేయర్‌ను గద్దె దించేందుకు జరుగుతున్న కుట్రలో బీసీలు భాగస్వాములు కావొద్దని, కూటమి నాయకులకు కనువిప్పు కలిగేలా అవిశ్వాస తీర్మానంలో ఓటు వేయాలని కోరారు. కలెక్టర్ ఈ కార్యక్రమాన్ని పారదర్శకంగా నిర్వహించాలని వారు విజ్ఞప్తి చేశారు.

లభించని గల్లంతైన విద్యార్థి ఆచూకీ



హెలికాప్టర్ సాయంతో గాలిస్తున్న నేవీ సిబ్బంది, న్యూపోర్టు పోలీసులు

పెదగంట్యాడ: పాత గంగవరం తీరంలో గురువారం గల్లంతైన విద్యార్థి ఒనుం తనూష్(15) ఆచూకీ ఇంకా లభ్యం కాలేదు. శుక్రవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు న్యూపోర్టు పోలీసులు, కోస్ట్‌గార్డు, నేవీ సిబ్బంది హెలికాప్టర్, డ్రోన్ సహాయంతో సముద్రంలో గాలించినా ఫలితం లేకపోయింది. శనివారం కూడా గాలింపు చర్యలు చేపడతామని న్యూపోర్టు పోలీస్‌స్టేషన్ సీఐ కామేశ్వరరావు తెలిపారు.

నేడు రాక్‌స్టార్ లైవ్ మ్యూజిక్ కాన్సర్ట్

ఏయూ క్యాంపస్: ఏటీసీటీ ఈవెంట్ మేనేజ్‌మెంట్ సంస్థ ఆధ్వర్యంలో శనివారం పోర్టు స్టేడియంలో మ్యూజిక్ కాన్సర్ట్ నిర్వహిస్తున్నట్లు ప్రముఖ సంగీత దర్శకుడు దేవిశ్రీప్రసాద్ తెలిపారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను శుక్రవారం బీచ్ రోడ్‌లోని నోవాటెల్ హోటల్‌లో ఆయన ఆవిష్కరించారు. అనంతరం డీఎస్పీ మీడియాతో మాట్లాడుతూ.. రాక్‌స్టార్ డీఎస్పీ లైవ్ ఇండియా టూర్‌లో భాగంగా విశాఖలో మూడో షో నిర్వహిస్తున్నామని తెలిపారు. గతంలో హైదరాబాద్, బెంగళూరులో విజయవంతంగా ప్రదర్శనలు జరిగాయని వెల్లడించారు. విశాఖ ప్రేక్షకులకు ప్రత్యేక అనుభూతినిచ్చేలా ఏర్పాట్లు చేశామన్నారు. ఏటీసీటీ ప్రతినిధి శోభన్ మాట్లాడుతూ 9,800 మంది ప్రేక్షకులకు అనుమతి లభించిందని, భద్రత, పార్కింగ్ ఏర్పాట్లు పూర్తి చేశామని తెలిపారు.

రైల్వేస్టేషన్‌లో ఈస్ట్‌కోస్ట్ రైల్వే జీఎం పర్యటన

తాటిచెట్లపాలెం: ఈస్ట్‌కోస్ట్ రైల్వే జనరల్ మేనేజర్ పరమేశ్వర్ ఫంక్వాల్ శుక్రవారం విశాఖ రైల్వేస్టేషన్‌లో పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన ప్లాట్‌ఫాంలపై ప్రయాణికుల కోసం కల్పిస్తున్న సౌకర్యాలను, స్టేషన్‌లో కొనసాగుతున్న అభివృద్ధి పనులను పరిశీలించారు. అనంతరం రైల్వే అధికారులతో సమావేశమై పలు విషయాలపై చర్చించారు. జీఎం పర్యటనలో భాగంగా రైల్వేస్టేషన్‌లో ఉన్న పాదచారుల వంతెనలు, లిఫ్టులు, ఎస్కలేటర్లు , రూట్ రిలే ఇంటర్‌లాకింగ్ క్యాబిన్‌లను ఆయన తనిఖీ చేశారు. విశాఖ–భువనేశ్వర్ వందే భారత్ ఎక్స్‌ప్రెస్ రైలులో ప్రయాణికులతో ముచ్చటించి, వారి అభిప్రాయాలు, సలహాలు, సూచనలను అడిగి తెలుసుకున్నారు.

ఆన్‌లైన్ పరీక్షల్లో జియాన్ గోల్‌మాల్!

• జియాన్ కేంద్రంగా జరిగిన పరీక్షల్లో మాల్ ప్రాక్టీస్‌పై ఆరోపణలు
• ఉద్యోగ స్థాయిని బట్టి అభ్యర్థుల నుంచి రూ.లక్షల్లో వసూలు!
• భెల్‌తో పాటు ఇతర పరీక్షల అవకతవకలపై ఏపీపీఎస్సీకి ఫిర్యాదులు
• అన్ని పరీక్షల కాపీయింగ్‌పై ఉన్నతస్థాయిలో సమగ్ర విచారణ



ఆందోళన చేస్తున్న అభ్యర్థులు

పెందుర్తి: పోటీ పరీక్షల్లో వేలాది మంది అభ్యర్థుల విలాపానికి.. అడ్డదారిలో కొలువు దక్కించుకున్న వారి విలాసానికి వేదికగా చినముషిడివాడలోని జియాన్ డిజిటల్ కేంద్రం ఆరోపణలు మూటగట్టుకుంది. ఇక్కడ ప్రతిభ కంటే పైసాకే ఎక్కువ ప్రాధాన్యమని ఇటీవల జరిగిన కొన్ని ఘటనలే నిదర్శనం. ఈ కేంద్రంలో జరిగే ప్రతి పోటీ పరీక్షలోనూ అడ్డదారుల్లో అభ్యర్థులకు సహకారం అందుతోందని బాధిత అభ్యర్థులు ఘంటాపథంగా చెబుతున్నారు. ఆ ఆరోపణలకు బలాన్ని చేకూర్చుతూ ఈ నెల 11న భారత్ హెవీ ఎలక్ట్రికల్స్ లిమిటెడ్(భెల్) సూపర్‌వైజర్ ట్రైనీ ఇంజనీర్ ఆన్‌లైన్ పరీక్షలో మాల్ ప్రాక్టీస్ ఘటన వెలుగుజూసింది. గత నెల 25న ఇదే కేంద్రంలో జరిగిన అసిస్టెంట్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీర్ పరీక్షలోనూ ఇదే తరహా మాల్ ప్రాక్టీస్ జరిగిందని కొంత మంది అభ్యర్థులు ఏపీపీఎస్సీ చైర్‌పర్సన్‌కు ఫిర్యాదు చేశారు.

మాల్ ప్రాక్టీస్‌కు సంపూర్ణ సహకారం

చినముషిడివాడ జియాన్ డిజిటల్స్‌లో ఏడేళ్లుగా దేశవ్యాప్తంగా ఉన్న ప్రముఖ ప్రభుత్వ, ప్రైవేటు రంగ సంస్థల్లో ఉద్యోగాలకు ఆన్‌లైన్ పరీక్షలు జరుగుతున్నాయి. గత రెండేళ్లుగా కేంద్రంలో ఆన్‌లైన్ పరీక్షల్లో అవకతవకలు జరుగుతున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. ఇక్కడ కొందరు బ్రోకర్ల అవతారం ఎత్తి ఉద్యోగాన్ని బట్టి బేరం కుదుర్చుకుంటున్నారు. ఆ తర్వాత ఆన్‌లైన్ పరీక్ష కేంద్రం నిర్వాహకులతో ఒప్పందం చేసుకుని, పరీక్ష సమయానికి ఏం చేయాలనే అంశంపై ముడుపులిచ్చిన అభ్యర్థులకు ముందుగానే ట్రెనింగ్ ఇస్తున్నారని ఆరోపణ. సదరు అభ్యర్థికి కేటాయించిన కంప్యూటర్ పాడవడం మొదటి ప్లాన్ అయితే, ముందుగానే జవాబు పత్రాన్ని అడ్మిట్ కార్డుపై ముద్రించడం రెండో ప్రణాళిక. ఇలా ఏదో ఒకటి అమలు చేసి డబ్బులు కట్టిన అభ్యర్థికి అధిక మార్కులు వచ్చేలా చేసి, మిగిలిన వారికి తీవ్ర అన్యాయం చేస్తున్నారన్నది ప్రధాన ఆరోపణ.

ఒక్కో స్థాయిలో ఒక్కో వ్యవహారం : వాస్తవంగా పరీక్ష కేంద్రంలో నిర్ణీత సమయంలో అభ్యర్థి తన అడ్మిట్ కార్డు నెంబర్ ఎంటర్ చేయగానే ప్రశ్నాపత్రం ప్రత్యక్షమవుతుంది. ముందుగా లీక్ అయ్యే అవకాశం ఉండదు. అయితే ఆయా ప్రశ్నాపత్రాన్ని రూపొందించిన బృందంలోని వ్యక్తులు బయటకు ఇస్తే మాత్రం బ్రోకర్లు దాన్ని సొమ్ము చేసుకుంటారు. ఇక ఆన్‌లైన్ పరీక్ష పర్యవేక్షణ చేసే ఇన్విజిలేటర్లు, ఇతర సిబ్బందిని డిజిటల్ కేంద్రమే ఏర్పాటు చేస్తుంది. టీసీఎస్ ఆధ్వర్యంలో సీసీ కెమెరాల పర్యవేక్షణ అంతా కేంద్రానిదే. ఇక్కడి నిర్వాహకులు తమకు డబ్బులు చెల్లించిన అభ్యర్థికి కంప్యూటర్ పాడైందన్న సాకుతో సీసీ కెమెరాల పర్యవేక్షణ లేని మరో కంప్యూటర్‌ను కేటాయిస్తారు. అక్కడ పేపర్‌ను మొబైల్లో రికార్డు చేసుకుని, వీలైనంత వేగంగా దానికి కీ రూపొందిస్తారు. ఆ కీని అభ్యర్థికి అందించి, కష్టపడి చదివిన వారికి అన్యాయం చేస్తున్నారు. జియాన్ డిజిటల్ కేంద్రంలో ఇలాంటి వ్యవహారాలు చాలా జరిగినట్లు బలమైన ఆరోపణలు ఉన్న నేపథ్యంలో ఈ మాల్‌ప్రాక్టీస్ వ్యవహారం నిగ్గు తేల్చేందుకు పోలీసులు రంగంలోకి దిగారు. వెస్ట్ జోన్ ఏసీపీ పృథ్వీతేజ విచారణాధికారిగా కేసు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. భెల్, టీసీఎస్‌ల నివేదికలు కూడా ఈ కేసులో అత్యంత కీలకం కానున్నాయి. కాగా జియాన్ డిజిటల్ కేంద్రంలో ఆన్‌లైన్ పరీక్షలు జరిగే సమయంలో ఏనాడూ పోలీస్ బందోబస్తు కోసం అభ్యర్థించిన దాఖలాల్లేకపోవడం కొసమెరుపు.



మాల్ ప్రాక్టీస్‌పై విచారిస్తున్న వెస్ట్ ఏసీపీ పృథ్వీతేజ

పేదలకు మెరుగైన వైద్యం

• మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి



కేజీహెచ్ రోగులతో మాట్లాడుతున్న మంత్రి డాక్టర్ డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి

మహారాణిపేట: పేదలకు నాణ్యమైన వైద్యం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి అన్నారు. శుక్రవారం కేజీహెచ్‌ను తనిఖీ చేశారు. ఓపీ, హెల్ప్ డెస్క్, క్యాజువాలిటీ, మందుల పంపిణీ, మానసిక వైద్య విభాగం, గైనకాలజీ, పిల్లల వార్డులను మంత్రి పరిశీలించారు. రోగులకు అందుతున్న వైద్య సేవలు, పారిశుధ్యం, భద్రతా ఏర్పాట్ల గురించి ఆరా తీశారు. ఎలక్ట్రికల్ , ఫైర్ సేఫ్టీ నిబంధనలు పాటించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం ఆస్పత్రిలో సౌకర్యాలపై మంత్రి సమీక్ష నిర్వహించారు. ప్రతి వార్డులో డ్యూటీ డాక్టర్ల వివరాలు, ఫీడింగ్ రూమ్, పిల్లల టాయిలెట్లు, బర్త్ సర్టిఫికెట్ , ఆధార్ నమోదు సౌకర్యాలు ఏర్పాటు చేయాలని సూచించారు. శిశు మార్పిడులు జరగకుండా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని మంత్రి ఆదేశించారు. అదనపు భవనాలు, సిబ్బందిని ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. కలెక్టర్ హరేందిర ప్రసాద్, ఎమ్మెల్యే వంశీకృష్ణ, ఎమ్మెల్సీ చిరంజీవి, సీపీ శంఖబ్రత బాగ్చీ, సూపరింటెండెంట్ కె.శివానంద, ఏఎంసీ ప్రిన్సిపాల్ సంధ్యాదేవి పాల్గొన్నారు.

గొలుసు దొంగల ఆటకట్టు

• 3 కేసుల్లో నలుగురు అరెస్ట్

ఎంవీపీకాలనీ: నగరంలోని పలు ప్రాంతాల్లో ఇటీవల చోటుచేసుకున్న వరుస గొలుసు దొంగతనాల కేసులను ద్వారకా క్రైం పోలీసులు ఛేదించారు. ఎంవీపీ క్రైం పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ద్వారకా క్రైం ఏసీపీ లక్ష్మణరావు ఈ వివరాలు వెల్లడించారు. నగరంలో వరుస దొంగతనాలు జరగడంతో క్రైం పోలీసు విభాగం అప్రమత్తమై త్వరితగతిన నిందితులను అరెస్ట్ చేసినట్లు చెప్పారు.

◆ శివాజీపాలెంలో శోభారాణి అనే మహిళ నుంచి 4 తులాల బంగారు గొలుసు అపహరించిన నిందితులకు తీవ్ర నేర చరిత్ర ఉన్నట్లు తెలిపారు. విజయవాడకు చెందిన నాగరాజు, ఇమ్రాన్‌లను ఈ కేసులో నిందితులుగా గుర్తించామని, ఇప్పటికే నాగరాజుపై 35, ఇమ్రాన్‌పై 25 పాత కేసులు నమోదైనట్లు చెప్పారు. విజయవాడ అజిత్ సింగ్ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో వీరిని అరెస్ట్ చేశామని, ఆ సమయంలో వారు కత్తులతో దాడి చేసేందుకు యత్నించినట్లు వివరించారు. స్థానికుల సహకారంతో వారిని చాకచక్యంగా పట్టుకున్నట్లు వెల్లడించారు. వారి నుంచి ద్విచక్ర వాహనంతో పాటు నాలుగు తులాల బంగారు గొలుసులు రెండు, రూ.30 వేలు నగదు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. వీరిని ఇప్పటికే రిమాండ్‌కు తరలించామన్నారు. అయితే వారు బయటకు వస్తే మరిన్ని దొంగతనాలు జరిగే ప్రమాదం ఉన్న నేపథ్యంలో.. వారు జైలు నుంచి బయటకు రాకుండానే చార్జ్‌షీట్ ఫైల్ చేసి కోర్టులో ట్రయల్ ప్రారంభమయ్యేలా చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు.

◆ మద్దిలపాలెం చైతన్యనగర్‌కు చెందిన హేమలత అనే మహిళ నుంచి బంగారు గాజులు, చైను లాక్కొని పరారైన నిందితుడు విజయనగరానికి చెందిన సిరిపురపు వెంకటరమణగా గుర్తించి అరెస్ట్ చేసినట్లు క్రైం ఏసీపీ తెలిపారు. అతనికి గతంలో ఎలాంటి నేర చరిత్ర లేదని వెల్లడించిన ఏసీపీ.. అతని నుంచి రూ.10 వేలు నగదు స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు. దొంగిలించిన బంగారాన్ని ముత్తూట్ ఫైనాన్స్‌లో రూ.2,80,500కు నిందితుడు తాకట్టు పెట్టినట్లు వివరించారు. ముత్తూట్ ఫైనాన్స్ నుంచి ఈ మొత్తాన్ని రికవరీ చేయాల్సి ఉందన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న క్రైం ఏసీపీ లక్ష్మణరావు

◆ ఎంవీపీ కాలనీలో లలిత అనే 90 ఏళ్ల మహిళ మెడలో రెండు తులాల బంగారు గొలుసు లాక్కెళ్లిన ఘటనలో నిందితుడు రైల్వే న్యూ కాలనీకి చెందిన పిడుగు జగదీష్‌గా గుర్తించినట్లు ఏసీపీ తెలిపారు. అతన్ని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు వెల్లడించారు. అతను దొంగిలించిన గొలుసును రూ.1,29,000కు ఫెడరల్ బ్యాంకులో తాకట్టు పెట్టినట్లు వివరించారు. బ్యాంకు నుంచి దాన్ని రికవరీ చేయాల్సి ఉందన్నారు. ఆయా కేసులు ఛేదించిన ద్వారకా క్రైం సీఐ చక్రధరరావు నేతృత్వంలోని ఎంవీపీ, ద్వారకా, ఆరిలోవ ఎస్‌ఐలు, ఏఎస్‌ఐలు, పీసీల బృందాలను ఆయన అభినందించారు.

త్యాగానికి ప్రతీక గుడ్ ఫ్రైడే

• రక్షణగిరిపై వేలాది మందితో శిలువ మార్గం

కంచరపాలెం: సర్వమానవాళి పాప విమోచన కోసం ఏసు ప్రభు ప్రాణత్యాగం చేసిన రోజే పవిత్ర శుక్రవారం(గుడ్‌ఫ్రైడే) అని విశాఖ ఆర్చి బిషప్ రెవరెండ్ ఫాదర్ ఉడుముల బాల అన్నారు. ఈ సందర్భంగా శుక్రవారం జ్ఞానాపురం పునీత పేతురు ప్రధాన దేవాలయంలో విచారణకర్త రెవరెండ్ ఫాదర్ జొన్నాడ జాన్ ప్రకాష్ నేతృత్వంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. జ్ఞానాపురం, రక్షణగిరి, కంచరపాలెం, అల్లిపురం, తాటిచెట్లపాలెం, మర్రిపాలెం, ఐటీఐ జంక్షన్, ఊర్వశి కూడలి తదితర ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులతో ప్రధాన దేవాలయ ప్రాంగణం కిటకిటలాడింది. క్రీస్తు త్యాగాన్ని కీర్తిస్తూ.. సర్వజన రక్షణ కోరుతూ కన్నీటితో ప్రార్థనలు చేశారు. శిలువ యాత్రకు జనం పోటెత్తారు. రక్షణ సభ గురువులు, పీపీసీ సభ్యుల సంయుక్త ఆధ్వర్యంలో ఫాదర్ ఉడుముల బాల, రెవరెండ్ ఫాదర్లు శిలువను మోసుకుంటూ వేలాది మంది భక్తులతో కలిసి రక్షణగిరిపైకి శిలువ మార్గం నిర్వహించారు. క్రీస్తు మరణాన్ని సూచిస్తూ ఏర్పాటు చేసిన క్రీస్తుల పాటుల స్మరణలోని 14 స్థలాల విగ్రహాల వద్ద ప్రార్థిస్తూ ప్రదక్షిణలు చేశారు. విచారణకర్త రెవరెండ్ ఫాదర్ జొన్నాడ జాన్ ప్రకాష్ సందేశాన్ని అందించారు. సెయింట్ పీటర్ పునీత పేతురు ప్రధాన దేవాలయం వద్ద బైబిల్ పఠనం, దివ్యపూజ బలులు, సామూహిక ప్రార్థనలు జరిగాయి. సాయంత్రం 5 గంటలకు ఉపవాస దీక్షాపరులు రక్షణగిరిపై దీక్ష విరమించారు. తర్వాత భక్తులు శిలువ ప్రతిరూపానికి భక్తి ప్రపత్తులతో ముద్దు పెట్టారు. అనంతరం దేవాలయాన్ని మూసివేశారు. ఈస్టర్ అర్ధరాత్రి జాగరణ వరకు మూసివేసి దేవాలయం మూసివేసి ఉంటుందని సహాయ విచారణ కర్తలు ఫాదర్లు వినయ్ కుమార్, ఆంథోనీ రాజ్ తెలిపారు.



సెయింట్ పీటర్స్ వద్ద శిలువను ముద్దాడుతున్న విశాఖ ఆర్చి బిషప్ ఉడుముల బాల

టిప్పు సుల్తాన్ బుల్లెట్.. డైనోసార్ ఎముకలు

• సందర్శకులను ఆకట్టుకున్న అరుదైన చారిత్రక వస్తువులు
• శిలాజాలు, స్టాంపులతో హవామహల్‌లో ప్రదర్శన



పురాతన ఇత్తడి లాంతర్‌ను ఆసక్తిగా తిలకిస్తున్న చిన్నారి



కిలో వెండితో గాంధీజీ పై మాల్టా దేశం విడుదల చేసిన నాణెం



గాంధీజీ ఉపయోగించిన వాచీ



కోట్ల సంవత్సరాల కిందటి శిలాజాలు, ఎముకలు



తాళపత్ర గ్రంథాలను ఆసక్తిగా చూస్తున్న బాలుడు



వెండి, బంగారం పూతతో తయారు చేసిన నాణాలు



దశాబ్దాల కిందటి వస్తువులు

ఏయూక్యాంపస్ : ప్రపంచ వారసత్వ దినోత్సవం సందర్భంగా హవా మహల్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన ప్రత్యేక ప్రదర్శన ఆకట్టుకుంది. వేల ఏళ్ల నాటి శిలాజాలు, శతాబ్దాల నాటి నాణాలు, అరుదైన స్టాంపులు సందర్శకులను అలరించాయి. ఎంపీ శ్రీ భరత్ ప్రదర్శనను ప్రారంభించి, చరిత్రను నేటి తరానికి తెలియజేయడానికి ఇటువంటి ప్రదర్శనలు ఉపయోగపడతాయన్నారు. బి.వెంకటేశ్వర్లు ప్రదర్శించిన హెరిటేజ్ స్టాంపులు, టిప్పు సుల్తాన్ కాలం నాటి బుల్లెట్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అనకాపల్లికి చెందిన ఎం.రాజాజీ నోబెల్ గ్రహీతలు, భారతరత్న పురస్కార గ్రహీతల స్టాంపులను, ఎం.కొండలరావు ఈస్ట్ ఇండియా కంపెనీ నాటి రెవెన్యూ స్టాంపులను ప్రదర్శించారు. మురళీనగర్‌కు చెందిన ఎం.కామేశ్వరరావు మౌర్య చంద్రగుప్తుల కాలం నాటి అత్యంత చిన్న నాణేంతో పాటు, 13, 16, 17, 18 శతాబ్దాల నాటి వివిధ రకాల నాణాలను ప్రదర్శించి సందర్శకులను సంభ్రమాశ్చర్యాలకు గురిచేశారు. మాల్టా దేశం కేజీ వెండితో ప్రత్యేకంగా విడుదల చేసిన మహాత్మా గాంధీ నాణం కూడా ఇక్కడ ప్రత్యేకంగా ప్రదర్శించారు. కె.వి.ఎస్.ఎన్ కుమార్ కంచు విగ్రహాలు, చిన్న పిస్టల్, వెండి వస్తువులను, కె.జి.ఎస్.సురేష్ పురాతన వెండి, ఇత్తడి వస్తువులను ప్రదర్శించారు. ఉపాధ్యాయుడు శ్రీనివాస్ చారిత్రాత్మక కరెన్సీ నోట్లను, కందుల వెంకటేష్ అరుదైన శిలాజాలు, డైనోసార్ పేడ, ఎముకలు, 6.5 కోట్ల సంవత్సరాల క్రితం నాటి చేప శిలాజంతో పాటు అరుదైన నాణాలను ప్రదర్శించి సందర్శకులను అబ్బురపరిచారు. హవా మహల్ నిర్వాహకురాలు మయూఖా దేవి ఈ కార్యక్రమానికి సమన్వయకర్తగా వ్యవహరించారు.

దళిత మహిళలను నిర్బంధించడం దారుణం

• విశాఖ ఆర్డీవోపై చర్యలు తీసుకోవాలి
• ప్రజా సంఘాల నాయకులు డిమాండ్



కలెక్టరేట్ వద్ద మాట్లాడుతున్న నాయకులు, బాధితులు

మహారాణిపేట: పెందుర్తి మండలం చినముషిడివాడలో దళిత, బహుజన మహిళలు నిర్మించిన డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్ విగ్రహాన్ని తొలగించాలని ఆర్డీవో శ్రీలేఖ, పెందుర్తి పోలీసులు బెదిరించినట్లు పలు ప్రజా సంఘాలు ఆరోపించాయి. కె.వన లత కుమారి, ఎం.నాగమణి, ఎం.జమున, జి.దేవి, కె.కనకరత్నంతో పాటు రిటైర్డ్ ఎస్‌ఐ ఎం.వి.గోపాలరావును విశాఖ కలెక్టరేట్‌లోని ఆర్డీవో కార్యాలయంలో శుక్రవారం ఉదయం 11 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు నిర్బంధించినట్లు వెల్లడించాయి. తమకు భోజనం, నీరు కూడా ఇవ్వకుండా బెదిరించారని బాధితులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై నిరసన తెలుపుతూ పీవోడబ్ల్యూ, మురికివాడ నివాసుల సంక్షేమ సంఘం, భీంసేన వార్, నవయానం బహుజన సంక్షేమ సంఘం, బుద్ధిస్ట్ సొసైటీ ఆఫ్ ఇండియా నాయకులు, బాధితులు కలెక్టరేట్ వద్ద మీడియా సమావేశం నిర్వహించారు. ఈ వ్యవహారానికి సంబంధించి వివరాలు వెల్లడించారు. చిన ముషిడివాడలోని ఆక్సిజన్ డిఫెన్స్ కాలనీలో బుర్రా రాజేష్ అనే వ్యక్తి 200 గజాల ప్రభుత్వ స్థలాన్ని ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడాన్ని అక్కడి దళిత, బహుజన మహిళలు అడ్డుకున్నారు. కలెక్టర్, సీపీ, చీఫ్ సిటీ ప్లానర్ దృష్టికి తీసుకొచ్చినా ఫలితం లేకపోయింది. కాలనీ సంఘం నిర్ణయం మేరకు మిగిలిన 50 గజాల స్థలంలో ఏప్రిల్ 14న అంబేడ్కర్ జయంతి సందర్భంగా మహిళలు రాజ్యాంగనిర్మాత విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. అయితే ఆర్డీవో శ్రీలేఖ పోలీసులతో కలిసి మహిళలను కార్యాలయానికి పిలిపించి విగ్రహం తొలగించాలని, లేకపోతే జైలుకు పంపిస్తామని బెదిరించడం సరికాదని భీంసేన వార్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ వసంత రాజేంద్ర ప్రసాద్ అన్నారు. ఈ చర్య రాజ్యాంగ విరుద్ధమని ఆయన ఖండించారు. ప్రభుత్వ స్థల ఆక్రమణపై అధికారులు చర్యలు తీసుకోకపోగా, విగ్రహం తొలగించాలని చూడటం అన్యాయమని పీవోడబ్ల్యూ రాష్ట్ర అధ్యక్షురాలు ఎం.లక్ష్మి అన్నారు. ఈ వ్యవహారంలో రాజకీయ నాయకులు వెంటనే జోక్యం చేసుకోవాలని, లేని పక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని ప్రజా సంఘాలు హెచ్చరించాయి.

డిగ్రీ విద్యార్థి బలవన్మరణం

• ప్రేమ విఫలమే కారణమా?



అప్పలనాయుడు(ఫైల్)

సబ్బవరం: ఇరువాడ శివారు గణపతినగర్‌కు చెందిన డిగ్రీ తృతీయ సంవత్సరం విద్యార్థి గురువారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్‌ఐ పి.సింహాచలం, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలివి.. గణపతినగర్‌కు చెందిన కర్రి నారాయణ పారాదీప్‌లో కూలీగా పనిచేస్తున్నాడు. అతని భార్య లీలాకుమారి భవన నిర్మాణ కార్మికురాలు. వీరి కుమారుడు అప్పలనాయుడు (17) సబ్బవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో డిగ్రీ తృతీయ సంవత్సరం చదువుతున్నాడు. గురువారం రాత్రి పండక్కి వెళ్తున్నానని తల్లితో చెప్పి అప్పలనాయుడు బయటకు వెళ్లాడు. తిరిగి అర్ధరాత్రి ఒంటి గంట సమయంలో ఇంటికి వచ్చి తల్లిని పిలిచాడు. తల్లి లేచి తలుపులు తీయడంతో.. కుమారుడు గదిలోకి వెళ్లిపోయాడు. తల్లి బయట గదిలో నిద్రపోయింది. కాగా.. అప్పలనాయుడు అర్ధరాత్రి 2.30 గంటల సమయంలో పెందుర్తి మండలం చినముసిడివాడ దరి ఏకలవ్యనగర్‌లో ఉంటున్న తన స్నేహితుడు కేశిబోయిన సుబ్రహ్మణ్యానికి వీడియో కాల్ చేసి తాను చనిపోతున్నట్లు చెప్పాడు. అటువంటి అఘాయిత్యానికి పాల్పడవద్దని స్నేహితుడు వారిస్తూ.. తాను వస్తున్నానని చెప్పి మరో స్నేహితుడితో కలిసి గణపతినగర్‌కు చేరుకున్నాడు. అతని తల్లిని నిద్రలేపి విషయం తెలియజేసి తలుపులు తీయించాడు. అయితే అప్పటికే అప్పలనాయుడు ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించాడు. విగత జీవిగా మారిన తన కుమారుడిని చూసి తల్లి బోరున విలపించింది. స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్‌ఐ పి.సింహాచలం ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించారు. తల్లి లీలాకుమారి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. ప్రేమ వైఫల్యం కారణంగానే ఆత్మహత్య చేసుకుని ఉంటాడని పోలీసుల ప్రాథమిక విచారణలో తేలినట్లు సమాచారం. ఈ విషయం బయటకు తెలిస్తే పరువు పోతుందనే భయంతోనే అఘాయిత్యానికి పాల్పడి ఉంటాడని తెలిసింది.

అండర్–23 క్రికెట్ జట్టు ఎంపికలు ప్రారంభం

విశాఖ స్పోర్ట్స్: వైఎస్సార్ ఏసీఏ–వీడీసీఏ నెట్స్‌లో శుక్రవారం అండర్–23 పురుషుల జట్టు ఎంపిక ప్రక్రియ ప్రారంభమైంది. మూడేళ్లుగా వీడీసీఏ జట్లకు ప్రాతినిధ్యం వహించిన ఆటగాళ్లతో పాటు కొత్తగా మరికొందరు ఓపెన్ కేటగిరీలో అవకాశం దక్కడంతో.. వీరంతా ట్రయల్స్‌లో పాల్గొన్నారు. ఇప్పటికే వీడీసీఏ బ్యాటింగ్ విభాగంలో 27 మందిని, వికెట్ కీపర్లుగా ఐదుగురిని, ఫాస్ట్ బౌలర్లుగా 14 మందిని, స్పిన్నర్లుగా మరో 13 మందిని ప్రాబబుల్స్‌గా ఎంపిక చేసింది. అయితే ఔత్సాహిక క్రీడాకారులు తమకు అవకాశం ఇవ్వాలని కోరడంతో విశాఖ క్రికెట్ సంఘం స్పందించింది. ఓపెన్ కేటగిరీలో అవకాశం కల్పించడంతో ప్రాబబుల్స్‌తో పాటు దాదాపు ఇరవై మంది ఔత్సాహికులు ఈ ట్రయల్స్‌కు హాజరయ్యారు. ఈ ఎంపిక ప్రక్రియ శనివారం కూడా కొనసాగనుంది. సోమవారం విశాఖ జిల్లా అండర్–23 జట్టును సెలక్షన్ కమిటీ ఎంపిక చేయనుంది. ఈ జట్టు 2025–26 సీజన్‌లో జరిగే వన్డే, మల్టీ–డే ఫార్మాట్ మ్యాచ్‌ల్లో జిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తుంది. ఎంపిక ప్రక్రియలో వయసు ధ్రువీకరణ పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించిన తర్వాతే ఆటగాళ్లను అనుమతించారు. బ్యాటింగ్, ఫీల్డింగ్‌తో పాటు బౌలింగ్ నైపుణ్యాల సెలెక్టర్లు నిశితంగా పరిశీలించారు.

విశాఖ విప్రోపై పల్సస్ గ్రూప్ కేసు

సీతమ్మధార: పల్సస్ గ్రూప్(ఒమిక్స్ ఇంటర్నేషనల్ ప్రైవేట్ లిమిటెడ్) ఫిర్యాదు మేరకు విప్రో కంపెనీపై ద్వారకా పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. వివరాలివి.. వేల సంఖ్యలో ఉద్యోగాలు కల్పిస్తామంటూ ప్రభుత్వం దగ్గర లీజు పేరిట రేసపువానిపాలెం సర్వే నం.39 పీ లో తీసుకున్న స్థలంలో భవనాన్ని నిర్మించిన విప్రో సంస్థ పల్సస్ గ్రూప్‌నకు లీజుకిచ్చింది. హామీ మేరకు ఉద్యోగ కల్పన చేయకపోవడంతో విప్రో పేరిట భూమిని ప్రభుత్వం రిజిస్టర్ చేయలేదు. ఈ నేపథ్యంలో ఆ సంస్థకు ఆ భూమిపై ఎలాంటి యాజమాన్య హక్కులు లేకపోయినా సదరు కమర్షియల్ స్పేస్‌ను పల్సస్ గ్రూప్‌నకు అద్దెకిచ్చింది. అయితే లీజ్ అగ్రిమెంట్ పల్సస్ పేరిట రిజిస్టర్ కాకపోవడంతో విప్రో స్పేస్‌లో అద్దెకు ఉండకుండా పల్సస్ గ్రూప్ తన సొంత బిల్డింగ్‌లో కంపెనీని ఏర్పాటు చేసుకుంది. దీంతో తమ స్పేస్‌లో అద్దెకు ఉండాలంటూ విప్రో కంపెనీ ఒత్తిడి చేయడాన్ని తట్టుకోలేకపోయిన పల్సస్ యాజమాన్యం న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. కోర్టు ఆదేశాల మేరకు ద్వారాకానగర్ పోలీస్ స్టేషన్‌లో విప్రో కంపెనీపై కేసు నమోదు చేశారు. ఐపీసీ సెక్షన్ 403, 405, 417, 156(3) సీఆర్పీసీ కింద కేసులు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఫిట్జీ కళాశాలపై చర్యలు తీసుకోవాలంటూ నిరసన

ఎంవీపీ కాలనీ: ఫిట్జీ జూనియర్ కళాశాల ఇంటర్‌తో పాటు ఐఐటీ, జేఈఈ, బిట్స్, ఎన్ఐటీ వంటి పరీక్షలకు విద్యార్థుల సన్నద్ధత పేరిట మోసం చేసిందంటూ ఇసుకతోట కూడలి దరి కళాశాల ఎదుట తల్లిదండ్రులు శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పలువురు తల్లిదండ్రులు మాట్లాడుతూ 2024–25 విద్యాసంవత్సరంలో అడ్మిషన్ తీసుకున్న తమ పిల్లల నుంచి రెండేళ్ల ఫీజును కళాశాల యాజమాన్యం ఒకేసారి కట్టించుకుందన్నారు. రూ.4 లక్షల నుంచి రూ.8 లక్షల వరకు ఫీజులు వసూలు చేసినట్లు తెలిపారు. ఫస్టియర్ పూర్తయ్యేసరికి ఇసుకతోట బ్రాంచ్‌ను పూర్తిగా ఎత్తేశారని పేర్కొన్నారు. ఇక్కడి ఉద్యోగులకు సైతం యాజమాన్యం జీతాలివ్వకపోవడంతో వారు మానేశారని తెలిపారు. దీంతో 200 మంది వరకు విద్యార్థుల భవిష్యత్ అంధకారంలో పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. టీసీలు తీసుకుని వెళ్లిపోదామని భావిస్తున్నా వాటిని ఇచ్చేందుకు సైతం క్యాంపస్ నిర్వహణ లేదని చెప్తున్నారు. తమను ఇన్ని ఇబ్బందులకు గురిచేసిన కళాశాల మాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు తమకు, తమ పిల్లలకు న్యాయం చేయాలని కోరుతూ ఎంవీపీ పోలీసు స్టేషన్‌తో పాటు నగర కమిషనర్‌కు తల్లిదండ్రులంతా కలిసి ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.